క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

పోస్టుల భర్తీ పారదర్శకంగా చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సిద్దికి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 3220 పోస్టులకు యూనివర్సిటీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చి యూనివర్సిటీలకే ఆ భర్తీ ప్రక్రియను అప్పగించారన్నారు. ఈ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు, నిరుద్యోగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలోనే దేశాభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 30 వరకు పోలీసు యాక్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నవంబరు నెల 1వ తేదీ నుంచి 30 తేదీ వరకు కడప పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. అలా కానీ పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్చి నిర్మాణ పనుల పరిశీలన



ఆర్చి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణ పరిధిలోని క్రాస్ రోడ్డు సమీపంలో నగర ప్రవేశం వద్ద జరుగుతున్న ఆర్చి నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. పనుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజల రాక పోకలను ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. అలాగే ఇతర అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్లతో ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లపురెడ్డిపల్లెలో ప్రభుత్వ బాలికల వసతి గృహం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో నూతనంగా బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పులివెందుల ప్రాంత వసతి గృహాల పర్యవేక్షణ అధికారి రామాంజనేయులు తెలిపారు. నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలకు వస్తుండటంతో వారికి ఇక్కడ వసతి గృహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సీఎం కార్యాలయం నుంచి ప్రత్యేక అనుమతులు మంజూరయ్యాయన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



వైవీయూలో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు



వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు

వైవీయూ : ఉక్కుమనిషి, సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవాన్ని విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, సమైక్యతా ప్రతిజ్ఞ నిర్వహించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పాల్గొని రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమైక్యతా భావంతో ముందుకువెళ్లి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ పటేల్ జీవితం యువతకు ఆదర్శమన్నారు. అనంతరం నిర్వహించిన ఐక్యతా పరుగు పరిపాలన భవనం వద్ద ప్రారంభమై వివిధ బ్లాక్‌ల వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు, వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో..

కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలోను, దేశాన్ని ఐక్యంగా ఉంచడంలోను సర్దార్ పటేల్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. కడప నగరంలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శంకర్ విచ్చేసి పటేల్ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవీంద్ర, నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. రవీంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



కడప ఎడ్యుకేషన్ : మను కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

■ నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా కళాశాల విద్యార్థినులు కడప ఆర్‌టీసీ బస్టాండు సమీపం నుంచి మహావీర్ జైన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు పాటుపడాలి

కడప ఎడ్యుకేషన్ : జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముక్సిత్‌ఖాన్ అన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత జాతీయ సమైక్యత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉపయోగపడుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. మంగళవార 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 23వ డివిజన్‌లోని రాజీవ్ గాంధీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్. కదిరమ్మ అనే మహిళ తనకు జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక, సున్నావడ్డీ, ఇంటి స్థలం ద్వారా రూ.10.52 లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. షేక్ నజిరున్నీసా అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న అమ్మ ఒడి, ఇంటి స్థలం, ఇల్లు ద్వారా రూ.10 లక్షల వరకూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపారు. అంతకుముందు 23వ డివిజన్ కార్పొరేటర్ టి. విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, డప్పు వాయిద్యాలతో డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతంపలికారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, సుభాన్‌బాషా, ఎన్. సుబ్బారెడ్డి, వేణుగోపాల్ నాయక్, రహీం, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, సుశీలమ్మ, తులశమ్మ, పాల్గొన్నారు.

విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్ చంద్

కడప కార్పొరేషన్ : రహదారుల విస్తరణ ఆ తర్వాత జరిగే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పలు ప్రాంతాలను పరిశీలించి, అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాసాపేట రోడ్డులో డివైడర్లలో వీధి దీపాలు వెలిగించాలని, ఫుట్‌పాత్‌ల ముందు మొక్కలు నాటించాలన్నారు. దేవునికడప రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు తక్షణం పూర్తి చేయాలన్నారు. మాచుపల్లి జంక్షన్ పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. గోకుల్‌లాడ్జి– క్రిష్ణా సర్కిల్ మార్గంలో ఆక్రమణలు తొలగించి, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ మధ్యలో ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. వై జంక్షన్ నుంచి అప్సర సర్కిల్ వరకు జరుగుతున్న డ్రైనేజీ పనుల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. బుగ్గవంక ప్రహరీ పక్కన 40 అడుగులతో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలన్నారు. కేసీ కెనాల్ పార్కు, రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. పార్కులో ఫుట్‌పాత్, బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. కేసీ కెనాల్ రోడ్డులో 33 అడుగులతో రోడ్డు నిర్మాణ పనులకు సరిపడేలా ఆక్రమణలు తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఇంజినీరింగ్, ఆర్‌అండబి అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో తీవ్రవర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయని, సంబంధిత రైతులను ఆదుకోవాలని ఖాజీపేట మండలానికి చెందిన రైతులు, సర్పంచులు కోరారు. ఈ విషయమై మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావును కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఖాజీపేట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి , సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ రాఘవరెడ్డిలు మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులతోపాటు కేసీ కాలువకు నీరు రాకపోవడంతో సాగు చేసిన చాలా పంటలు ఎండుముఖం పడుతున్నాయన్నారు. దీంతో చాలా మంది రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులకు సబ్సిడీగానీ, పంటలబీమా గాని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, రామక్రిష్టారెడ్డి, రామకృష్ణ, రైతులు సుబ్బారెడ్డి, వెంకటరెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కడప పాతబస్టాండ్ వద్ద ఉన్న సీఐటీయూ ఆఫీస్‌లో బంద్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడారు.

కమలాపురం నగర కమిషనర్‌గా బీవీ నరసారెడ్డి



కమలాపురం : నగర పంచాయతీ కమిషనర్‌గా బీవీ నరసారెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నరసారెడ్డిని కమలాపురం కమిషనర్ (ఎఫ్‌ఏసీ)గా బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి పనులు పూర్తి చేయడంతో పాటు స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక మున్సిపల్ సిబ్బంది ఆయన పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు.

చుక్కల భూముల సమస్య పరిష్కరించాలి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, రైతులు

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండల పరిధిలోని చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని ఖాజీపేట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ ప్రెసిడెంట్ పీవీ రాఘవరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పగిడేల శివరామిరెడ్డిలతోపాటు పలువురు సర్పంచులు రైతులు కోరారు. ఈ విషయమై మంగళవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజును కడపలో కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాజీపేట మండలంలో దాదాపు 4 వేల ఎకరాలు చుక్కల భూములు ఉన్నాయన్నారు. గతంలో చుక్కల భూముల నిషేధిత జాబితా 22 తయారు చేసే క్రమంలో అప్పటి ఖాజీపేట తహశీల్దార్, రెవిన్యూ సిబ్బంది తప్పిదం కారణంగా ప్రతి గ్రామం నుంచి చాలా మంది రైతులకు ఆన్‌లైన్‌లో ముటేషన్ కాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఎవరైనా రైతులు తమ పొలాలను అమ్ముకోవాలన్నా, కొనాలన్నా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఇటీవల తుడుమలదిన్నె గ్రామంలో వెంకటసుబ్బారెడ్డి అనే రైతు కూడా ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. చుక్కల భూములు ఉన్న రైతులు ఖాజీపేట మండలంలో రెండు వేలమంది ఉన్నారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుమలదిన్నె సర్పంచ్ క్రిష్ణారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రామకృష్ణారెడ్డి, చెన్నముక్కపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, పత్తూరు సర్పంచ్ రామకృష్ణ, రైతులు చెన్నకేశవరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, డేవిడ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, నాయకులు



విద్యుత్ భవన్ ఎదుట మాట్లాడుతున్న బి. రామలింగారెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్: కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కేసి.బాదుల్లా, ఎస్. మహబూబ్‌బాషా, కోశాధికారి శ్రీను, పాల్ తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రెటరీ కేసి బాదుల్లా, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు నడుంబిగించాలి

కడప కార్పొరేషన్ : కార్మిక హక్కుల పరిరక్షణకు నడుంబిగించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి. రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం విద్యుత్ భవన్ ఎదుట ఏఐటీయూసీ పతాకాన్ని ఉప ప్రధాన కార్యదర్శి కె. బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రతాప్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డి సర్కిల్ : కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాము గౌడ్, శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హుస్సేన్, నరసారెడ్డి శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై కేంద్రం తీరు హేయం

కమలాపురం : కార్మిక చట్టాలపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరు హేయం అని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి తెలిపారు.

స్టాక్ మార్కెట్‌లో అవకాశాలు మెండు



మాట్లాడుతున్న సెబీ నిపుణుడు ప్రభాకర్

వైవీయూ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు స్టాక్ మార్కెట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఒమన్ దేశ మస్కట్ కళాశాల మాజీ ఆచార్యులు, ప్రస్తుత సెబీ శిక్షణ నిపుణులు డా. కె. ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూ ఎంబీఏశాఖ ఆధ్వర్యంలో 'యువ నిర్వాహకుల ఆర్థిక విద్య' అన్నఅంశంపై రెండు రోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, మెలకువలు, ఉపాధి అవకాశాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డా. అమృత ప్రసాద్‌రెడ్డి, డా.వై. సుబ్బరాయుడు, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, డా.వరప్రభాకర్, డా. సరిత, డా.ఎస్.సుబ్బారెడ్డి, డా. గంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


తెలుగు సాహిత్యంలో ఒంటిమిట్ట రామయ్య వైభవం



వక్తను సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం నిర్వాహకులు, అతిథులు

కడప కల్చరల్ : తెలుగు సాహిత్యంలో ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని వైభవం అప్రతిహతంగా సాగిందని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ అన్నారు. సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం తెలుగు సాహిత్యంలో ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి అనే అంశంపై మాట్లాడారు. ఒంటిమిట్ట కోదండరాముడిని సేవించిన, కీర్తించిన కవులు రచయితలు ఎందరో ఉన్నారని తెలిపారు. 1440 ప్రాంతపు అయ్యలరాజు తిమ్మయ్య ఒంటిమిట్ట రఘువీరా మకుటంతో శతకం రచించారని తెలిపారు. తాళ్లపాక అన్నమయ్య జయజయరామ వంటి కీర్తనలు రాశారన్నారు. బమ్మెర పోతన భాగవతరచనలో ఆయనకు దర్శనమిచ్చిన దైవం ఒంటిమిట్ట కోదండరాముడే అని తెలిపారు. అయ్యలరాజు తిప్పయ్య మనుమడు అయ్యల రాజు రామభద్రుడు, మట్లిరాజుల ఆస్థానంలోని ఉప్పుగొండూరు వెంకట కవి, నల్లకాలువ అప్పయ కవి, వాసుదాసు ఆంధ్రవాల్మీకిగా పేరున్న వావిలికొలను సుబ్బారావు తదితరులు ఒంటిమిట్ట రాముడిని కీర్తిస్తూ రచనలు చేశారన్నారు. సభాధ్యక్షులు హౌసింగ్ బోర్డు రామాలయ ధర్మకర్త, విశ్రాంత ఏఈ దేసు వెంకటరెడ్డి మాట్లాడుతూ 10 ఏళ్ల పాటు ఒంటిమిట్టలో ఉద్యోగజీవితం గడిపినప్పుడు ఆ స్వామి సేవ చేసుకునే భాగ్యం లభించిందని, అది అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నిర్వాహకులు, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు రమేష్‌రావు, హరిభూషణరావు, అతిథులు గానుగపెంట హనుమంతరావు, ఒంటిమిట్ట కోదండరామాలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, ముమ్మడి నారాయణ రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు వక్త పసుపులేటి శంకర్‌ను, దేసు వెంకటరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఓటర్ల ముసాయిదా జాబితాపై డిశంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. మంగళవారం కడప ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయం, పోలింగ్ బూత్ వద్ద జాబితాలను ప్రదర్శించామన్నారు. ప్రజలు తమ ఓటు ఉందో లేదో సరిచూసుకోవాలన్నారు. ఒక వేళ ఓటరుగా నమోదు కాకుంటే ఫారం–6 సమర్పించాలన్నారు. ఏమన్నా అభ్యంతరాలుంటే ఫారం–7, మార్పులు చేర్పులకు ఫారం –8 సమర్పించాలన్నారు. నవంబరు 4, 5, డిశంబరు 2, 3 తేదీలో స్పెషల్ క్యాంపెయినింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆ రోజు బీఎల్‌ఓలు, ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు. జనవరి 5 వ తేదీ ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శివరామిరెడ్డి రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కుడా ఛైర్మన్‌కు సన్మానం



కుడా ఛైర్మన్ గురుమోహన్‌ను సన్మానిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులో నిర్మించిన అంబేడ్కర్ భవన్ అభివృద్ధి పనులకు గాను కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసిన కుడా ఛైర్మన్ సింగసాని గురుమోహన్‌ను మంగళవారం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ భవన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూకట్లపల్లె మురళి, దళిత చైతన్యఫోరం రాష్ట్ర నాయకులు సొద్దలపెంచలయ్యలు మాట్లాడుతూ భవనం అభివృద్ధి చేయని కారణంగా అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధ దృష్టికి తీసుకెళ్ళగా రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయించి కొంత మేర ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడం జరిగిందని, మిగిలిన అభివృద్ధి పనులకు కుడా ఛైర్మన్ గురుమోహన్ రూ.20 లక్షలు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ గురుమోహన్ మాట్లాడుతూ సామాజిక సాధికారత దిశగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లీం, మైనార్టీలకు ఉపయోగపడే అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.సి.రమణ, బీసీ సంఘాల నాయకులు గురుమూర్తి, అనిల్, సీపీఐ మాజీ నాయకులు పాల్గొన్నారు.

వేములలో బిజీబిజీగా ఎంపీ పర్యటన

వేముల : వేములలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం రూ.6.87 కోట్ల పాడా నిధులతో నూతనంగా నిర్మించిన భవనాలను ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డిలతో కలసి ప్రారంభించారు. ముందుగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.28 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.48 లక్షలతో నిర్మించిన బల్క్‌మిల్క్ సెంటర్‌ను ప్రారంభించారు. అలాగే రూ.1.85 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.1.75 కోట్లతో నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. అక్కడ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విజిటర్స్ పుస్తకంలో సంతకం చేశారు. అక్కడి నుంచి సమీపంలోని కస్తూర్బా విద్యాలయ ప్రాంగణంలో రూ.2.06 కోట్లతో నిర్మించిన కస్తూర్బా బాలికల జూనియర్ కళాశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా గంగాదేవి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శారద, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచ్ రామాంజనమ్మ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గౌస్‌పీరా, కోఆప్షన్ సభ్యులు మాపీరా, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు రాఘవరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాధాకృష్ణయ్య, చలపతి, వెంకటశివారెడ్డి, గంగిరెడ్డి, మదార్‌వలి, పి.రమణ, ఎన్.గంగాధర, నాగభూషణం, కె.వెంకటరామిరెడ్డి, పుల్లారెడ్డి, డీలర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.